సాక్షి
విశాఖపట్నం

సోమవారం । 25 । మార్చి । 2024





చదివించిన అమ్మఒడి

'జగనన్న అమ్మ ఒడి' పథకం నిరుపేద విద్యార్థుల చదువులకు భరోసాగా నిలిచింది. 8లో

న్యూస్‌రీల్

బంధాల బలోపేతమే లక్ష్యం



ప్రీ సెయిల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భారత, అమెరికా నేవీ కమాండర్లు

సింథియా: భారత, అమెరికా సంయుక్తంగా విశాఖలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయాంఫ్–2024లో భాగంగా ఆదివారం ప్రీ సెయిల్ కాన్ఫరెన్స్ జరిగింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇరుదేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కాన్ఫరెన్స్ సాగినట్లు నేవీ వర్గాలు తెలిపాయి. భారత, అమెరికా నేవీ భాగస్వామ్య యూనిట్ల కమాండింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అమెరికా నౌకకు ఘన స్వాగతం



సింథియా: టైగర్ ట్రయాంఫ్–2024లో పాల్గొనేందుకు యూఎస్‌కు చెందిన అర్లీ–బుర్క్ క్లాస్ గైడెడ్–మిస్సైల్ డిస్ట్రాయర్ యూఎస్ఎస్ హాల్సే (డీడీజీ 97) విశాఖ చేరుకుంది. ఈ నౌకకు భారత నావికాదళం ఘన స్వాగతం పలికింది.

హిందీ హయ్యర్ పరీక్షా ఫలితాలు విడుదల

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో గత ఫిబ్రవరిలో జరిగిన హయ్యర్ పరీక్షా ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలకు భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి నుంచి 12 మంది విద్యార్థులు హాజరయ్యారని అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. వీరిలో 11 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

ఘనంగా గౌర పూర్ణిమ ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం గౌర పూర్ణిమ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో శ్రీ రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగనాథ స్వామివార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం సంకీర్తనలు, పుష్పాభిషేకం, ప్రసాద వితరణ చేశారు. రుషికొండలో హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు నిర్వహించారు. అనంతరం యువకులు బీచ్ వద్ద ఉట్టి సంబరాలు నిర్వహించారు. శ్రీకృష్ణ, బలరాములకు పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సాయం.. మరువలేం



- హార్బర్‌లో బోట్ల ప్రమాద బాధితులకు మూడు రోజుల్లోపే పరిహారం
- రూ.7.11 కోట్లు అందించి ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కన్నీళ్ల స్థానంలో పెల్లుబికిన ఆనందబాష్పాలు
- సీఎం జగన్ సాయాన్ని మరవబోమంటున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం : పార్టీలను చూడలేదు.. పక్షపాతమూ చూపలేదు.. బాధితులను ఆదుకోవాలన్న దృఢ నిశ్చయం. అదే సంకల్పంతో ఫిషింగ్ హార్బర్ బోట్ల దగ్ధం ప్రమాద బాధితులకు గంటల వ్యవధిలోనే పరిహారాన్ని అందించారు. ఆ పరిహారం మొక్కుబడిగా కాదు.. వారు ఊహించనంత.. ఉక్కిరి బిక్కిరయ్యేటంత! దీంతో ఈ మత్స్యకారులంతా కష్టకాలంలో తక్షణమే తమను ఆదుకున్న దేవుడంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కొనియాడుతున్నారు. ఆయన చేసిన సాయాన్ని మరవబోమంటున్నారు. ఆయనకు ఎల్లప్పుడూ అండగా ఉంటామంటున్నారు.

గత ఏడాది నవంబరు 19వ తేదీ అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 49 బోట్లు ఆహుతయ్యాయి. వీటిలో 30 బోట్లు పూర్తిగా, 19 బోట్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో తమ పట్ల ప్రభుత్వం ఎలా స్పందిస్తుందోనని బాధిత మత్స్యకారులు ఎంతగానో కలత చెందారు. రూ.లక్షల విలువైన మరపడవలు కాలిపోవడంతో తమ భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళనకు గురయ్యారు. పిల్లా పాపలతో రోడ్డెక్కి రోదించారు. జరిగిన నష్టంలో ఎంతో కొంత పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటారేమోనని భయపడ్డారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఈ ప్రమాదాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూశారు. ఈ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సాయం చేయదంటూ బాధితులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. కానీ బాధితుల భయాందోళనలకు ఫుల్‌స్టాప్ పెడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెనువెంటనే స్పందించి అత్యంత ఉదారమైన నిర్ణయాన్ని తీసుకున్నారు.

సీఎం స్పందన భేష్

ప్రమాదం జరిగిన వెంటనే సీఎం జగన్ ఉన్నత స్థాయి అధికారులను రంగంలోకి దించారు. మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును హార్బర్‌కు పంపారు. బోట్ల దగ్ధంతో మత్స్యకారులకు వాటిల్లే నష్టాన్ని అంచనా వేయించారు. నష్టంలో 80 శాతం మొత్తాన్ని పరిహారంగా చెల్లిస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. అంతే కాదు బాధిత మత్స్యకారులకు వెంటనే పరిహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఆగమేఘాలపై బాధితుల జాబితాను రూపొందించారు. 30 బోట్లు పూర్తిగా, 19 బోట్లు పాక్షికంగా దగ్ధమైనట్టు తేల్చారు. మూడు రోజుల్లోనే బోటు విలువలో 80 శాతం సొమ్మును పరిహారంగా బాధితులందరికీ చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. రూ.7.11 కోట్ల మొత్తాన్ని అందజేశారు.

దీంతో పరిహారంపై వీరికున్న అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. అలాగే అగ్ని ప్రమాదంలో కాలిపోయిన బోట్లపై ఆధారపడిన 400 మంది కలాసీల (వర్కర్ల)కు కూడా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించారు.



మత్స్యకారులకు చెక్ అందజేస్తున్న ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి(ఫైల్)

పరిహారం.. అనూహ్యం

వాస్తవానికి జరిగిన నష్టంలో 50 శాతానికి మించి ప్రభుత్వం పరిహారం ఇవ్వదని భావించారు. అయితే సీఎం జగన్ ఏకంగా 80 శాతం సొమ్ము చెల్లించే సరికి బాధిత మత్స్యకారుల ఆనందానికి అవధుల్లేవు. ప్రతిపక్ష నాయకుల నోట నుంచి మాటల్లేవు. అప్పటిదాకా కన్నీళ్లు ఉబికిన బాధితుల కళ్ల నుంచి ఆనందబాష్పాలు కురిశాయి. తాము ఊహించిన దానికంటే ఎక్కువ పరిహారం ఇచ్చారని కొనియాడుతున్నారు. ఇప్పుడు వీరంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమ పాలిట దేవుడని, జీవితాలు నిలిపిన ఆయనకు జీవితాంతం అండగా ఉంటామంటున్నారు.

జగన్ సాయం మరచిపోం



బోటు కాలిపోయింది.. ఇక జీవితాలేమవుతాయోనని ఆందోళన చెందిన మాకు సీఎం జగన్ భారీ పరిహారమిచ్చి ఆదుకున్నారు. హార్బర్‌లో కాలిన మా బోటు (వీ–5ఎంఎం–836)కు రూ.23.20 లక్షల పరిహారం అందింది. రూ.28 లక్షలతో ఓ పాత బోటు కొని రీమోడల్ చేయించుకుంటున్నాం. సీఎం జగన్ మేలు మరచిపోం. ఆయన మళ్లీ సీఎం కావడానికి పాటుపడతాం.

– వాసుపల్లి ఎల్లమ్మ, బాధిత బోటు యజమాని, రెల్లివీధి

అంత పరిహారాన్ని ఊహించలేదు



దగ్ధమైన నా బోటు (వీ–5ఎంఎం 167)కు సీఎం జగన్ రూ.20.40 లక్షలు చెల్లించారు. ఇంత పరిహారం ఇస్తారని మేం కలలో కూడా అనుకోలేదు. పైగా మూడురోజుల్లోపే చెక్కులు చేతికిచ్చారు. ఈ డబ్బుతో బోటు కొనుక్కుని నెల రోజుల్లోనే తిరిగి వేట ప్రారంభించాం. సీఎం జగన్ చేసిన సాయానికి జీవితాంతం రుణపడి ఉంటాం. వచ్చే ఎన్నికల్లో తామంతా ఆయనకు అండగా నిలుస్తాం.

– మైలపిల్లి చిన్నయ్య, బాధిత బోటు యజమాని

బాబు అయితే ఇంత ఇచ్చేవారు కాదు

హార్బర్‌లో కాలిపోయిన మా బోటు (వీ–5ఎంఎం 222)కు రూ.28.80 లక్షలు చెల్లించారు. అంత సాయాన్ని, అదీ మూడురోజుల్లోనే ఇస్తారని మేం అస్సలు ఊహించలేదు. పరిహారం సొమ్ములో రూ.20 లక్షలతో పాత బోటును కొన్నాం. మరో రూ.8 లక్షలు మరమ్మతులకు పెట్టి వేటకు సిద్ధం చేశాం. ఈ ప్రమాదం చంద్రబాబు పాలనలో జరిగి ఉంటే రూ.5–6 లక్షలకు మించి వచ్చేది కాదు.

– గిరికిన దానయమ్మ, బాధితురాలు

పక్షపాతం లేకుండా పరిహారం



బోట్లు కాలిపోయిన బాధిత మత్స్యకారుల్లో టీడీపీకి చెందిన వారు కూడా ఉన్నారు. అయినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలను చూడకుండా, పక్షపాతం లేకుండా పరిహారం అందజేసింది. అగ్ని ప్రమాదం జరిగిన మూడు రోజుల్లోనే సొమ్ము చెల్లించింది. దీంతో కొద్ది రోజుల్లోనే మత్స్యకారులు బోట్లు కొనుక్కుని తమ జీవనోపాధి కొనసాగించడానికి తోడ్పడింది. బాధితులు ఊహించిన దానికంటే మూడు నాలుగు రెట్లు అధికంగా పరిహారం చెల్లించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దే. దీనిని బట్టి మత్స్యకారుల పట్ల ఆయనకున్న అభిమానం, ఉదారత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.

– వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

సింహగిరిపై నృసింహ యజ్ఞానికి ఏర్పాట్లు

రేపు అంకురార్పణ.. 1న మహాపూర్ణాహుతి



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: లోక కల్యాణార్థం సింహగిరిపై ఈ నెల 26 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలు చేయనున్నారు. వచ్చేనెల ఒకటిన మహా పూర్ణాహుతి క్రతువుతో ఈ మహాయజ్ఞం ముగియనుంది. ఈ మేరకు సింహగిరిపై ఉత్తర రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన యజ్ఞశాలలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలియజేశారు. యజ్ఞంలో పాల్గొనే ఉభయదాతలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రూ.3 వేల టికెట్ తీసుకోవాలన్నారు. ఒక టికెట్‌పై ఉభయదాతలతో పాటు ఇద్దరు పిల్లలను అనుమతిస్తామని చెప్పారు. టికెట్ తీసుకున్న వారు తమకు కేటాయించిన రోజు ఉదయం 6.30 గంటలకల్లా సింహగిరికి చేరుకోవాలని సూచించారు. ముందుగా అంతరాలయ దర్శనం, అల్పాహారం అందించిన అనంతరం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు యజ్ఞం నిర్వహిస్తామన్నారు. పూర్ణాహుతి అనంతరం ఉభయదాతలకు ప్రత్యేకంగా భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్ మాట్లాడుతూ ఐదు కుండాలతో ఈ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ నెల 27 నుంచి 31 వరకు యజ్ఞశాలలో ఉదయం 7 గంటల నుంచి అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠ, యాగశాలార్చన, కుంభావాహనం, మండలావాహనం, హోమం, పూర్ణాహుతి జరుపుతామన్నారు. 27 నుంచి 31వరకు సాయంత్రం 4.30 గంటలకు స్వామిని ఒక్కో వాహనంపై మాడవీధుల్లో తిరువీధి నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేనెల ఒకటిన ఉదయం 9.13 గంటలకు మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం చేస్తామన్నారు. ఈ మహా యజ్ఞంలో పాల్గొనే భక్తులు సింహగిరిపై కౌంటర్లలో, కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లోను టికెట్లు లభిస్తాయి. www. aptemples. ap. gov. in ద్వారా తీసుకున్న టికెట్ల వివరాలను 63038 00739 కు వాట్సాప్ ద్వారా సమాచారం తెలియజేయాలి.

వుమెన్ అండర్-19 రన్నరప్ జట్టుకు ప్రోత్సాహకం



రూ.20 లక్షల చెక్‌ను ఆంధ్ర-19 జట్టుకు అందజేస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: బీసీసీఐ అంతర్రాష్ట్ర వుమెన్ అండర్–19 టీ20 ట్రోఫీలో రన్నరప్‌గా నిలిచిన ఆంధ్ర జట్టుకు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి రూ.20 లక్షల ప్రోత్సాహకాన్ని అందించారు. విశాఖలోని వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా వుమెన్‌కు టీ20 లీగ్‌ను ఆంధ్రలో నిర్వహించడంతో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్ర రెడ్డి ప్రోత్సాహంతో ఆంధ్ర నుంచి అంతర్జాతీయ క్రికెటర్లను తీర్చిదిద్దే లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించామన్నారు. ప్రతిభ ఉన్న క్రికెటర్లను గుర్తించి వరల్డ్ క్లాస్ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. దీనిలో భాగంగానే జోనల్ స్థాయి దాటిన యువ క్రీడాకారులకు పౌష్టికాహారం అందించేందుకు ఏప్రిల్ నుంచి నెలకు మూడువేలు ఆర్థిక సాయం ప్రకటించామన్నారు. ఇందుకు ఏడాదికి రూ.1.50 కోట్లు వెచ్చించనున్నామన్నారు. మరోసారి ఏపీఎల్‌తో పాటు వుమెన్ ప్రీమియర్ లీగ్ నిర్వహణకు బీసీసీఐ కార్యదర్శి జైషాను అనుమతి కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. జట్టుకు ఆడిన సభ్యులకు ఎలక్ట్రానిక్ బైక్‌లను ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వర్‌నాథ్ అందజేశారు. కార్యక్రమంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యురాలు ఎన్.గీత, సీఈవో ఎంవీ శివారెడ్డి, సీఎఫ్‌వో ఎం. నవీన్‌కుమార్, జీఎంలు ఎంఎస్ కుమార్, ఎస్.రోహిత్ వర్మ, వీడీసీఏ కార్యదర్శి పార్థసారథి, జాయింట్ సెక్రటరీ జేకేఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయను శాశ్వతంగా నిర్మూలిద్దాం

కలెక్టర్ మల్లికార్జున పిలుపు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జిల్లాలో క్షయ మహమ్మారిని శాశ్వతంగా నిర్మూలించేందుకు జిల్లా యంత్రాంగం, పారిశ్రామిక వేత్తలు కలిసికట్టుగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ, క్షయ నిర్మూలన సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పరిషత్ వరకు కొనసాగిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 1200 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారని.. మొండి క్షయతో బాధ పడుతున్న వ్యాధిగ్రస్తులు మరో 30 మంది వరకు ఉన్నారన్నారు. వీరందరికీ అవసరమైన మందులను ఎప్పటికప్పుడు అందిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల సీఎస్సార్ నిధులతో ప్రతి నెలా వ్యాధిగ్రస్తులకు బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నట్లు వెల్లడించారు. కేవలం పౌష్టికాహార కిట్ల కోసం ప్రతి నెలా రూ.5 లక్షల వరకు సీఎస్సార్ నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి వరకు పౌష్టికాహార కిట్లను అందించామని, ఫిబ్రవరి, మార్చి నెలకు సంబంధించి అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ప్రశంసాపత్రాల అందజేత

జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు. తొలుత డాక్టర్ రాబర్ట్ కోచ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ క్షయను నిర్మూలించేందుకు ప్రతీ ఏడాది ఓ నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. రోగ నిర్ధారణ నుంచి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా అయ్యే వరకు అవసరమైన మందులు, వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. విధుల్లో ప్రతిభ చూపిన నిక్షయ మిత్రలు, వైద్యులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను బహూకరించారు. తొలుత క్షయ వ్యాధి నిర్మూలనపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ సిహెచ్ పూర్ణేంద్రబాబు, ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్, ఎంవోడీటీసీ డాక్టర్ సత్యవేణి, పెందుర్తి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఆర్.కె.దొర, విశ్రాంత జిల్లా టీబి నియంత్రణ అధికారి(శ్రీకాకుళం) డాక్టర్ ఎస్. అనూరాధ, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచ్చు బిగుస్తోంది

- డ్రగ్స్ కంటైనర్ కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం
- బ్రెజిల్ కంపెనీ నుంచి సమాచారం కోసం ఆరా
- సంధ్యా ఆక్వా కార్యాలయాల నుంచి కీలక సమాచారం
- సమాచార విశ్లేషణలో నిపుణులు

విశాఖ సిటీ : సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై ఉచ్చు బిగుస్తోంది. డ్రగ్స్ కంటైనర్ కేసులో సీబీఐ అధికారులు దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. ఇప్పటికే కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్న అధికారులు వాటి విశ్లేషణలో బిజీ అయ్యారు. ప్రతిపక్ష టీడీపీ వ్యూహాత్మకంగా ముందుగానే అధికారపక్షం పైకి నెట్టేందుకు చేసిన ప్రయత్నాలు ఒక్కొక్కటిగా తేలిపోతున్నాయి. ఆధారాలన్నీ సంధ్యా ఆక్వా యాజమాన్యం వైపే వేలెత్తి చూపుతున్నాయి. వీరి వెనుక సూత్రధారులెవరు? ఎంత కాలంగా సాగుతోందీ వ్యవహారం అన్నదానిపై సీబీఐ అధికారులు ప్రధానంగా దృష్టిసారిస్తున్నట్లు తెలుస్తోంది.

డ్రగ్స్ కంటైనర్ కేసులో రోజులు గడుస్తున్నకొద్దీ సంధ్యా ఆక్వా యాజమాన్యం వైఖరిపైనే సందేహాలు ముసురుకుంటున్నాయి. ఇప్పటికే ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు పూర్తి చేసిన సీబీఐ అధికారులు డొంకను ఆధారంగా చేసుకుని.. తీగల్ని వెలికి తీసే పనిలోపడ్డారు. ఈ షిప్‌మెంట్ పంపించిన బ్రెజిల్‌కు చెందిన కంపెనీ నుంచి సమాచారం కోసం ఆరా తీస్తున్నారు. సంధ్యా ఆక్వా ఆర్డర్ పెట్టింది, బ్రెజిల్ కంపెనీ పంపించిందీ ఒకటేనా? కాదా? అన్న నిర్ధారణ కోసం ప్రయత్నిస్తున్నారు. అందుబాటులో ఉన్న వివరాల మేరకు బ్రెజిల్ కంపెనీ, సంధ్యా ఆక్వా ఇరువురి సహకారంతోనే ఈ కన్‌సైన్‌మెంట్ నడించిదని సమాచారం.

డబ్బులు చెల్లించకుండానే షిప్‌మెంట్?

వేర్వేరు దేశాలకు చెందిన వ్యాపార సంస్థల మధ్య జరిగే లావాదేవీలన్నీ దాదాపు ముందస్తు చెల్లింపుల ద్వారానే జరుగుతాయి. అయితే ఈ భారీ షిప్‌మెంట్ మాత్రం ఎలాంటి చెల్లింపుల్లేకుండానే జరగడంతో సీబీఐ అధికారుల్లో మరింత అనుమానం పెంచుతోంది. డబ్బులు చెల్లించకుండా ఇంత మొత్తంలో సరకు పంపేందుకు బ్రెజిల్ సంస్థతో సంధ్యా ఆక్వాకు ఉన్న వ్యాపార సంబంధాలపై కూపీ లాగుతున్నారు. దీనిపై ఇప్పటికే సంధ్యా యాజమాన్యాన్ని పలుమార్లు విచారించారు. ఈ సంస్థకు విశాఖతోపాటు పలు జిల్లాల్లోని కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. కీలక ఫైళ్లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. వీటి ఆధారంగా అదనపు సమాచారం కోసం ప్రయత్నిస్తున్నారు.

ఈ డ్రై ఈస్ట్ దేశం మొత్తానికి సరిపోతుందట!

సాధారణంగా చేపలు, రొయ్యల చెరువుల్లో వేసే మేతలో అదనపు పోషకాల కోసం డ్రై ఈస్ట్‌ను స్వల్ప మోతాదులో కలుపుతారు. దీన్ని నేరుగా మేత కోసం వినియోగించే అవకాశాలు దాదాపు లేవు. ఏదైనా ఒక ఆక్వా పరిశ్రమ వందల కిలోల్లో డ్రై ఈస్ట్‌ను కొనుగోలు చేయడమే దాదాపు జరగని పని. అలాంటిది 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌కు సంధ్యా ఆక్వా ఆర్డర్ పెట్టడమే అనుమానాలకు తావిస్తోంది. ఈ మొత్తంతో దేశంలోని ఆక్వా పరిశ్రమ అవసరాల్ని తీర్చేయొచ్చట. దీంతో సంధ్యా ఆక్వా ఇప్పటి వరకు చేసుకున్న దిగుమతులన్నింటిపైనా సీబీఐ అధికారులు దృష్టిసారించారు.

డ్రగ్స్ శాతం ఎంత? : సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్న డ్రై ఈస్ట్ ప్యాకెట్లలో నిషేధిత డ్రగ్స్ ఎంత మొత్తంలో ఉన్నవీ ఇంకా తెలియలేదు. ఇప్పటికే వీటిలో కొకైన్, కొడైన్, ఓపియం, మెథాక్విలాన్ తదితర ఏడు రకాల మాదకద్రవ్యాలున్నట్లు ప్రాథమిక పరీక్షల్లో తేలింది. అయితే కిలోకి ఎంత చొప్పున, ఏం డ్రగ్ ఉందన్న అంశంపై క్లారిటీ లేదు. పూర్తి స్థాయి ఫలితాల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు మిశ్రమాల శ్యాంపిళ్లను పంపించారు. అక్కడి నుంచి నివేదికలు వస్తేనే అసలు డ్రగ్స్ ఎంత మొత్తంలో ఉన్నాయో లెక్కతేలనుంది.



సిబ్బందిపైనా సందేహాలు

ఈ మొత్తం వ్యవహారంలో కస్టమ్స్, పోర్టు సిబ్బందిపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కోర్టుకు ఏదైనా కంటైనర్ వస్తే దాన్ని నిశితంగా పరిశీలించాల్సిన అధికారులు ఈ డ్రగ్స్ ఉన్న కంటైనర్‌ను ఎందుకు పట్టించుకోలేదన్న అంశం అనేక అనుమానాలకు తావిస్తోంది. వాహనంపై కంటైనర్ ఉండగానే లోపల ఇటువంటి నిషేధిత వస్తువులు ఉన్నాయన్న విషయాన్ని స్కాన్ చేసే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ డ్రగ్స్ కంటైనర్‌ను పట్టించుకోకపోవడంపై సీబీఐ అధికారులు ఆరా తీస్తున్నారు. ఎలాంటి తనిఖీల్లేకుండా ఈ కంటైనర్‌ను ఎలా అన్‌లోడ్ చేశారన్నదానిపై సీబీఐ అధికారులు విచారణ జరుపుతున్నారు. ఇందులో కస్టమ్స్, పోర్టు అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అన్న దిశగా వివరాలు సేకరిస్తున్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ ఫలితాలు, సంధ్యా ఆక్వా నుంచి స్వాధీనం చేసుకున్న రికార్డుల విశ్లేషణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

సారీ సందీప్!

- జనసేన మరో ఝలక్
- టికెట్ ఇవ్వలేమన్న నాగబాబు
- భీమిలి సీటు టీడీపీకేనని స్పష్టీకరణ
- ఐదేళ్లుగా పార్టీకి చాకిరీ చేశామని ఆవేదన
- అనుచరులతో బల ప్రదర్శనకు ప్రయత్నం

సాక్షి, విశాఖపట్నం : జనసేనను నమ్ముకున్న వారికి ఒక్కొక్కరికీ ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఝలక్ ఇస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి.శివశంకర్, బొలిశెట్టి సత్యనారాయణ, పీఏసీ సభ్యుడు కోన తాతారావు, పీవీఎస్ఎన్ రాజులకు టికెట్లు ఇవ్వకుండా షాక్ ఇచ్చారు. వీరిలో శివశంకర్ పెందుర్తి, బొలిశెట్టి అనకాపల్లి ఎంపీ, కోన తాతారావు గాజువాక, పీవీఎస్ఎన్ రాజు చోడవరం టికెట్లను ఆశించారు. వీరంతా ఏళ్ల తరబడి జనసేనలో ఉంటూ పార్టీ కోసం పాటుపడుతున్నారు. ఈ ఎన్నికల్లో తమకు టికెట్లు దక్కడం ఖాయమన్న భావనతో ఇన్నాళ్లూ పనిచేశారు. అయితే వీరిని కాదని నిన్న గాక మొన్న జనసేనలోకి జంప్ చేసిన పంచకర్ల రమేష్ బాబుకు పెందుర్తి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు అనకాపల్లి సీటు ఖరారు చేశారు. దీంతో షాక్ గురైన శివశంకర్, బొలిశెట్టి సత్యనారాయణ, కోన తాతారావు, పీవీఎస్ఎన్ రాజులు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. కాగా భీమిలి సీటు తనకు ఇస్తారని ఎప్పట్నుంచో ఆశలు పెట్టుకుని జనసేన కోసం అక్కడ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ పనిచేస్తున్నారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్, ఆయన సోదరుడు నాగబాబులతో ఆయన సన్నిహితంగా ఉండేవారు. గతంలో ఈ నేతలు 'భీమిలి టికెట్ నీకే' అంటూ సందీప్‌కు భరోసా కూడా ఇచ్చారు. ఆ భరోసాతో సందీప్ భీమిలి నియోజకవర్గంలో చాలా హడావుడి, హంగామా చేశారు. అంతేకాదు భీమిలి సీటు తనకు ఖరారు చేశారంటూ ఇటీవల పార్టీ శ్రేణులకు స్వీట్లు కూడా పంచారు. బాణసంచా కాల్చారు.



సందీప్

అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు (అనకాపల్లి, యలమంచిలి, పెందుర్తి) సీట్లను ఖాయం చేసినా భీమిలి టికెట్‌పై జనసేన అధిష్టానం స్పష్టత ఇవ్వలేదు. ఇంతలో భీమిలి సీటు జనసేన పొత్తు జాబితాలో లేదని, ఈ సీటును టీడీపీకి కేటాయిస్తారన్న ప్రచారం ఊపందుకుంది. అయినప్పటికీ సందీప్ ఆశలు సన్నగిల్లలేదు. తనకున్న అన్ని మార్గాల ద్వారా టికెట్ గురించి ఆరా తీశారు. ఈ నేపథ్యంలో ఇటీవల నాగబాబు నుంచి పిలుపు వచ్చింది. ఆ పిలుపు అందుకుని వెళ్లిన సందీప్‌కు నాగబాబు 'సారీ సందీప్.. నీకు టికెట్ ఇవ్వలేకపోతున్నాం. కూటమి అధికారంలోకి వస్తే మంచి ప్రాధాన్యత ఇస్తాం' అని రొటీన్‌గా చావు కబురు చల్లగా చెప్పారు. దీంతో హతాశుడైన సందీప్.. 'ఇన్నాళ్లూ పార్టీ కోసం ఎంతో కష్టపడ్డాను. డబ్బు ఖర్చు పెట్టుకున్నాను. ఎలాగైనా సీటు ఇప్పించండ'ని ప్రాధేయపడ్డా తన చేతుల్లో ఏమీ లేదని నాగబాబు చేతులెత్తేసినట్టు తెలిసింది. దీంతో సందీప్ తన అనుచరులతో బల ప్రదర్శనకు దిగారు. ఆదివారం మీడియా సమావేశం పెట్టించి తనకు భీమిలి టికెట్ ఇవ్వాలని ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు.

వంశీకృష్ణ ఆశలకు గండి పడినట్లేనా?

ఆరిలోవ: విశాఖ దక్షిణ జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఎంపిక ఇంకా ఖరారు కాలేదు. దీంతో ఆ సీటుపై ఆశలు పెట్టుకున్న వంశీకృష్ణ శ్రీనివాస్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం రాత్రి 18 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను అధికారికంగా ప్రకటించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేనకు నాలుగు అసెంబ్లీ సీట్లు కేటాయించిన విషయం తెలిసిందే. అనకాపల్లికి కొణతాల రామకృష్ణను, యలమంచిలికి సుందరపు విజయకుమార్‌ను, పెందుర్తికి పంచకర్ల రమేష్‌బాబును ఆదివారం ప్రకటించారు. విశాఖ దక్షిణ స్థానాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టారు. కొద్ది రోజుల ముందు దక్షిణ సీటును వంశీకృష్ణకు కేటాయించినట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఆయన నియోజకవర్గంలో హడావుడి చేశారు. అంతవరకు సీటు ఆశించిన జనసేన నాయకులు వంశీని తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. నిరసనలు చేపట్టారు. వంశీకృష్ణకు జనసేన సీటు కేటాయిస్తే ఓటమి ఖాయమని శాపనార్థాలు పెట్టారు. చివరకు కార్పొరేటర్ సాధిక్, వంశీకృష్ణ అనుచరులు రోడ్డెక్కారు. భౌతిక దాడులు కూడా చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో జనసేన అధ్యక్షుడు సందిగ్ధంలో పడ్డారని ఆ పార్టీ నేతలు అంటున్నారు. అందుకే దక్షిణ సీటుపై పునరాలోచన చేస్తున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వంశీకృష్ణ ఆశలకు గండిపడినట్లేనని అంటున్నారు. వంశీకృష్ణకు సీటు ఖాయమని భావించినప్పటికీ.. తాజా జాబితాలో పేరు లేకపోవడంతో ఆయన వర్గీయులు నిరాశకు గురయ్యారు. మరోవైపు వంశీకృష్ణను వ్యతిరేకించే వర్గంలో కొత్త ఉత్సాహం వచ్చింది.

క్లుప్తంగా

ఆటోడ్రైవర్ల తగాదాలో ఒకరి మృతి

ఎంవీపీకాలనీ: ప్రయాణికుల విషయంలో ఇద్దరి ఆటోడ్రైవర్ల మధ్య మొదలైన తగాదా.. ఓ డ్రైవర్ ప్రాణం తీసింది. సెల్‌ఫోన్‌తో ఆటోడ్రైవర్‌పై దాడి చేయడంతో ఎంవీపీకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ మృతి చెందాడు. ఎంవీపీకాలనీలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఎంవీపీ సెక్టార్–1 చెందిన మహ్మద్ అనిఫ్ (64) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో అతను ఎంవీపీకాలనీలోని స్టాండ్‌లో ఆటో నిలిపి వేచి ఉన్నాడు. మరో ఆటోస్టాండ్‌కు చెందిన డ్రైవర్ ప్రభాకర్ ఆ మార్గంలో వచ్చి అనిఫ్ ఉన్న ఆటోస్టాండ్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ప్రభాకర్ ఫోన్‌తో అనిఫ్‌ను కొట్టడంతో అతను స్పృహ కోల్పోయాడు. ప్రభాకర్‌తో పాటు స్థానికులు అతన్ని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అనిఫ్ చనిపోయినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై అనిఫ్ కుమారుడు మహ్మద్ అబ్దుల్ ఆజాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి రిమాండ్

మర్రిపాలెం: హత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. ఇల్లాపు హేమ సతీష్ అనే యువకుడు ఊర్వశీ దరి గోకుల్‌నగర్‌లో పాన్ షాపు నడుపుతున్నాడు. శనివారం రాత్రి 10.30 ప్రాంతంలో షాపు మూసేసిన తర్వాత తన స్నేహితుడు వరుణ్‌తో కలిసి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో బంగార్రాజుతో పాటు మరో వ్యక్తి బైకుపై వచ్చి కత్తితో సతీష్‌పై దాడికి దిగారు. గమనించిన సతీష్, అతని స్నేహితుడు తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సతీష్ తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నానికి పాల్పడిన బంగార్రాజును ఆదివారం సీఐ ఎస్.భాస్కర్‌రావు నేతృత్వంలో పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిపై ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది.

చదివించిన అమ్మ ఒడి



అమ్మ ఒడితో ఆనందంగా బడికి వస్తున్న విద్యార్థినులు

నవశకం సంక్షేమ సంతకం

విశాఖ విద్య: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన 'జగనన్న అమ్మ ఒడి' పథకం నిరుపేద విద్యార్థుల చదువులకు భరోసాగా నిలిచింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న అర్హులైన విద్యార్థులందరికీ ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించింది. ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరమైన వారంతా అమ్మ ఒడి ఉందనే ధీమాతో మళ్లీ బడిబాట పట్టారు. 2022–23 విద్యా సంవత్సరం(గతేడాది)లో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3,72,134 మంది విద్యార్థులు ఉండగా, 2023–24 విద్యా సంవత్సరం(ఈ ఏడాది)లో ఆ సంఖ్య 3,91,736 మందికి చేరింది.

అమ్మ ఒడికి అర్హతే ప్రామాణికం

విద్యార్థుల చదువులకు తోడ్పాటు అందించాలనే ఉన్నతాశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమ్మ ఒడి పథకంను ప్రవేశపెట్టారు. అర్హతే ప్రామాణికంగా ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్నప్పటికీ.. అమ్మ ఒడి మంజూరు చేశారు. పథకం పారదర్శకంగా అమలు చేసే క్రమంలో సచివాలయం స్థాయిలో లబ్ధిదారుల బయోమెట్రిక్ అథంటికేషన్(ఈకేవైసీ) ధ్రువీకరణ, ఆధార్ కార్డు అనుసంధానంతో ఉన్న బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. మధ్యవర్తులు లేకుండా.. నేరుగా లబ్ధిదారులకు డబ్బులు అందుతున్నాయి.

ప్రతీ విద్యార్థి ఖాతాలో రూ.60 వేలు జమ

ఏటా ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఒడి అమలైంది.

జగన్ దయతో ఉన్నత చదువులు



నా పేరు మేరుగు నాగమణి. భీమిలి బీచ్‌రోడ్డు మంగమారిపేటలో నివాసం ఉంటున్నాం. మా ఆయన మేరుగు చిన్నారావు వేటకు వెళ్తారు. మాకు ఇద్దరు అమ్మాయిలు. కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పిల్లల చదువులు మానిపించేద్దామని అనుకున్నాం. వారి భవిష్యత్ కూడా మాలానే ఉంటుందని ఆందోళన చెందాం. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల అమ్మ ఒడితో పిల్లల చదివించుకున్నాం. మా చిన్న అమ్మాయి షాలిని ప్రస్తుతం ఇంటర్ పూర్తి చేసింది. పెద్ద అమ్మాయికి రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. నాడు ఆర్థికంగా జగనన్న ఆదుకోకుంటే నేడు మా పిల్లల పరిస్థితి వేరేలా ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో నేడు సగర్వంగా జీవించగలుగుతున్నాం. ఆయనకు మా కుటుంబం ఎల్లవేళలా రుణపడి ఉంటుంది.

- పేదల చదువులకు కొండంత అండ
- అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న అమ్మ ఒడి
- ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు మంజూరు
- నాలుగేళ్ల కాలంలో రూ.1,111.52 కోట్లు విడుదల
- బడిబాట పట్టిన నిరుపేద వర్గాల పిల్లలు

ఏడాదికి రూ.15వేలు చొప్పున ప్రతీ విద్యార్థికి ప్రభుత్వం మొత్తంగా రూ.60 వేలు అందజేసింది. ముందస్తు షెడ్యూల్ మేరకు 2023–24 విద్యా సంవత్సరం సంబంధించి మరో రూ.15 వేలు ఈ వేసవి సెలవులు అనంతరం స్కూళ్లు తెరిచిన తర్వాత తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. ఇలా ఏటా క్రమం తప్పకుండా అమ్మ ఒడి పథకం అమలు చేసి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద విద్యార్థుల చదువులకు అండగా నిలిచారని విద్యారంగ నిపుణులు అంటున్నారు.

విద్యాకానుకతో ధీమా

జగనన్న విద్యాకానుక పథకం కింద ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్, నోట్ పుస్తకాలు, బూట్లు, షూస్,



సాక్స్, యూనిఫాం(మూడు జతలు) ఇలా తొమ్మిది రకాల వస్తువులను ఇస్తున్నారు. ఒక్కో కిట్‌కు రూ.1,964లు ఖరీదు చేయనుండగా, ఏటా జిల్లాలో లక్ష మందికి పైగా పంపిణీ చేస్తున్నందుకు గానూ ప్రభుత్వం ఏడాదికి రూ.20 కోట్ల వరకు చెల్లిస్తోంది.

నాలుగు విడతలుగా జిల్లాలో అమ్మ ఒడి లబ్ధిదారులు, మంజూరైన డబ్బులు

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	1,95,442	290.16
2020-21	2,02,042	303.06
2021-22	1,75,065	262.60
2022-23	1,70,467	255.70
మొత్తం	7,43,016	1,111.52

దర్జాగా చదివించుకుంటున్నాం



నా పేరు బంగారి లక్ష్మి. మా పాప జ్యోత్స్న అక్కయ్యపాలెం మున్సిపల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. కాలనీలో ఇస్త్రీ బండి పెట్టుకున్నాం. తద్వారా వచ్చే ఆదాయమే మా కుటుంబానికి జీవనాధారం. అమ్మ ఒడి పథకం మాకు ఎంతో ఉపయోగపడింది. నాలుగు సార్లు మాకు అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి. మా పిల్లలను దర్జాగా చదివించుకుంటున్నాం. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రుణం తీర్చుకుంటాం.

పేదింటి పిల్లలకు అమ్మ ఒడి ఓ వరం



నా పేరు మారుపల్లి దేవి. మాది ఎంవీపీ కాలనీ సెక్టార్–9 అప్పుఘర్ ప్రాంతం. నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరినీ బడికి పంపించి చదివిస్తున్నాను. అబ్బాయి ఇంటర్ చదువుతుండగా అమ్మాయి పాఠశాల విద్యనభ్యసిస్తోంది. ఈ ప్రభుత్వంలో నాకు ఇల్లు కూడా మంజూరైంది. సున్నా వడ్డీ రుణాన్ని కూడా పొందుతున్నారు. గతంలో ఫీజురీయింబర్స్‌మెంట్ ద్వారా యువత ఉన్నత విద్యకు మహానేత వైఎస్సార్ బాటలు వేశారు. ఉమ్మడి రాష్ట్రంలో లక్షల మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యవైపు దూసుకెళ్లారు. ఆయన బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన అమ్మ ఒడి పథకం పేదింటి పిల్లలకు వరంగా మారింది. పేద పిల్లలు ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా నిలవడానికి ఈ పథకం బాటలు వేస్తోంది. సామాన్య ప్రజానీకాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి పథకాలను రూపొందించడం ఒక్క వైఎస్సార్ కుటుంబానికే చెల్లింది. ఇందుకు ఆ కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటాం.

'అమ్మ ఒడి'తో మా పిల్లలకు బంగారు భవిష్యత్



నా పేరు పాడి పద్మ. మాది ఎంవీపీ కాలనీ. నాకు ఇద్దరు పిల్లలు. బాబు ఎంఎస్ చేస్తుండగా పాప ఇంటర్ చదువుతోంది. మా అమ్మాయి చదువుకు అమ్మ ఒడి ద్వారా ఆర్థిక భరోసా లభిస్తోంది. అబ్బాయికి జగనన్న విద్యాదీవెన లభించింది. విదేశాల్లో చదవడానికి ఆర్థిక భరోసా కోసం జగనన్న విదేశీ విద్యకు దరఖాస్తు చేశాం మరోసారి జగనన్న అధికారంలోకి వస్తే విదేశీ విద్య లభిస్తుందని భావిస్తున్నాం. ఈ పథకాలు ద్వారా మా పిల్లలు విద్యావంతులయ్యారు. రానున్న రోజుల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించాలనే వారి కల కూడా నెరవేరుతుంది. నేను ఆసరా, సున్నా వడ్డీ రుణం వంటి పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుతున్నాను. మా పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం వారి తల్లిదండ్రులుగా ఎన్నటికీ మరువలేం.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించి శంకుస్థాపన

90వ వార్డులో టీడీపీ కార్పొరేటర్ ఘనకార్యం

విశాఖ విద్య: 90వ వార్డు రెడ్డి వీధి రామాలయం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు టీడీపీ కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. శంకుస్థాపన చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నగర పాలక సంస్థ అధికారులెవ్వరూ లేకుండానే.. రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన పేరుతో కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు. అసలు విషయమేమిటంటే.. ఈ పనులకు నెల రోజుల కిందటే శంకుస్థాపన జరిగింది. గ్రంథాలయం మరమ్మతులు, దీనికి ఎదురుగా ఉన్న సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం రూ.15 లక్షల జీవీఎంసీ నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. కానీ.. ఇదే పనికి కార్పొరేటర్ బొమ్మిడి రమణ అత్యుత్సాహంతో శంకుస్థాపన చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున.. ఓటర్లను ప్రలోభానికి గురిచేసేలా కార్పొరేటర్ వ్యవహరించడంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కొంత మంది ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను వివరణ కోరగా.. పనులు శంకుస్థాపనపై తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. తాము కూడా అక్కడికి వెళ్లలేదని పనులు పర్యవేక్షిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

జోరుగా వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18, 19వ వార్డులకు చెందిన మత్స్యకారులు భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం సాయంత్రం లాసన్స్ బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ మత్స్యకారులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గంపల వెంకట రామచంద్రరావు ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా రంజక పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు వెల్లడించారు. కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసు, గణేష్, పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎంవీవీ సత్యనారాయణ, గంపల వెంకట రామచంద్రరావు

డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నీ విజేత ఈకోర్సా

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌ఎం కప్ ఆహ్వాన వాలీబాల్ టోర్నీ విజేతగా ఈకో రైల్వే జట్టు నిలిచింది. హోరాహోరీగా సాగిన మెన్ ఫైనల్స్‌లో ఈకోర్సా జట్టు 3–1 సెట్ల తేడాతో ప్రకాశం జిల్లా జట్టుపై విజయం సాధించింది. బెస్ట్ ఆఫ్ ఫైవ్‌గా సాగిన ఫైనల్‌లో ఈకోర్సా జట్టు తొలి సెట్‌ను 25–9తో ఆధిక్యాన్ని ప్రదర్శించినా రెండో సెట్‌లో 25–10తో ప్రకాశం జట్టు సమం చేసింది. 25–16, 25–14 పాయింట్ల తేడాతో తరువాత రెండు సెట్లలోనూ ఆధిక్యాన్ని ప్రదర్శించిన ఈకోర్సా విజేతగా నిలిచింది. దీంతో ప్రకాశం జట్టు రన్నరప్‌గా సరిపుచ్చుకుంది. వుమెన్ ఫైనల్స్‌లో పికేఆర్ ఆర్ట్స్ సైన్స్ కళాశాల జట్టుపై కిట్ వర్సిటీ జట్టు విజయం సాధించింది. వుమెన్‌లో బెస్ట్ అటాకర్‌గా సింధూర, బెస్ట్ లిబిరోగా విద్యశ్రీ, బెస్ట్ సెట్టర్‌గా అశ్వతి నిలిచారు. రైల్వే గ్రౌండ్స్‌లో ఆదివారం మెన్ మూడో స్థానానికి జరిగిన పోటీలో కృష్ణా జిల్లా జట్టు 25–20తో ముందంజలో నిలిచినా రెండో సెట్‌లో తూర్పుగోదావరి జిల్లా జట్టు 16–25తో సమం చేసింది. చివరికి డిసైడింగ్ సెట్‌లో 15–9తో కృష్ణా జట్టు విజయం సాధించి సెకండ్ రన్నరప్‌గా నిలిచింది. వుమెన్ మూడో స్థానానికి జరిగిన పోటీలో ఎన్‌బిపి ట్రస్ట్ జట్టు నేరుగా 2–0 సెట్లతోనే జెపిఆర్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. పోటీల ముగింపు కార్యక్రమానికి డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ హాజరై విజేత జట్లకు ట్రోఫీలందించారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్

ట్యాంకర్‌ను ఢీకొని యువకుడు దుర్మరణం

పీఎం పాలెం : ఎండాడ – పీఎం పాలెం మధ్యలో గల జాతీయ రహదారిపై ఆగివున్న ట్యాంకర్‌ను బైక్‌తో ఢీకొన్న యువకుడు ఘటనా స్థలిలోనే మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ సాయిప్రియ లే అవుట్‌లో ఆటో డ్రైవర్ కె.కొండల రమేష్, భార్య, కుమార్తె, కుమారుడు జశ్వంత్ (21)తో నివసిస్తున్నాడు. ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్న జశ్వంత్ పెదవాల్తేర్ ప్రాంతంలోని ఓ వ్యాయామ కళాశాలలో శిక్షకునిగా పనిచేస్తున్నాడు. శనివారం విధులకు వెళ్లి రాత్రి ఆలస్యం కావడంతో అక్కడే వుండిపోయాడు. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఎండాడ దాటి న్యాయ కళాశాల కూడలి వద్దకు వచ్చే సరికి జాతీయ రహదారిపై ఆగివున్న ట్యాంకర్‌ను ఢీకొట్టాడు ఈ ప్రమాదంలో జశ్వంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు లా అండ్ ఆర్డర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



జశ్వంత్ (ఫైల్)

కనుల పండువగా అనంతుని రథోత్సవం

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ముందుగా విశేష హోమం, గ్రామ బలిహరణం, మంగళాశాసనం వంటి పూజాది కార్యక్రమాలు జరిగాయి. తదుపరి కుంతీ మాధవ స్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి విగ్రహాలను పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ రథంపైకి తోడ్కొని వచ్చారు. రథంపై ఉభయ దేవేరులతో ఉన్న అనంత పద్మనాభ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రథం ముందు కుంభం (అన్నం) పోశారు. పద్మనాభం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సీహెచ్ శ్రీధర్ ప్రథమ పూజ అనంతరం రథోత్సవం.. కుంతీ మాధవ స్వామి ఆలయ గోపురం నుంచి రాత్రి 11.30 గంటలకు ప్రారంభమైంది. భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం రాజవీధి గుండా ముందుకు కదిలింది. విజయనగరం, విశాఖపట్నం, సింహాచలం నుంచి భక్తులు తరలివచ్చారు. ఈవో నానాజీ బాబు పర్యవేక్షణలో రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, తాలాడ పైడిరాజు, భక్తబృందం సభ్యులు కంటుబోతు ఎర్నాయుడు, మొకర సన్నిబాబు పాల్గొన్నారు.



అనంతుని రథం



ఉత్సవ విగ్రహాలు

వేసవి శిబిరాలు.. భవితకు బాటలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్(ఈకోర్సా), వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ప్రారంభమైంది. రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాలో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఈకార్వో అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలు చిన్నారుల మానసిక ఉల్లాసానికి, వారితో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 24 నుంచి మే 15వ తేదీ వరకు అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్కేటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ తదితర అంశాల్లో ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల వయసు ఉన్న వారికి శిక్షణ ఇస్తామన్నారు. ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్ కుమార్ సాహూ(ఆపరేషన్స్), క్రీడాధికారి ప్రవీణ్ భటి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్, కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.



వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

హోలీ.. ఆనందాల కేళీ

- ఎన్‌ఏడీలో సంబరాలు
- పాల్గొన్న బొత్స ఝాన్సీ, ఆనంద్ కుమార్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు వుడా కాలనీలో ఆదివారం రాత్రి హోలీ వేడుకలు కోలాహలంగా జరిగాయి. కాలనీలోని పటేల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి పాల్గొన్నారు. పటేల్స్ కుటుంబీకులతో కలసి వారు సంప్రదాయబద్ధంగా వేసిన హోలీ దహన్‌లో పాల్గొన్నారు. పటేల్స్ సమాజ్‌కు చెందిన పెద్దలు, పిల్లలు, మహిళలు అంతా ఒక చోటకు చేరి, హోలీ దహన్ చుట్టూ తిరుగుతూ సంప్రదాయ గీతాలను ఆలపించారు. అట్టహాసంగా జరిగిన హోలీ సంబరాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ, ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అన్ని మతాలు, వర్గాల సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి వేడుకల్లో భాగస్వాములం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



వేడుకల్లో పాల్గొన్న బొత్సఝాన్సీ, ఆనంద్‌కుమార్, శ్రీధర్, రమాకుమారి

ఘనంగా హోలికా దహనం

బీచ్‌రోడ్డు: చెడుపై మంచి విజయానికి ప్రతీకగా ఆదివారం ఆర్.కె.బీచ్‌లో ఉత్తరాది ప్రజలు హోలికా దహనం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తీరానికి చేరుకుని.. పిడకల దండకు వేసి అందులో హోలికా అనే రాక్షసిని బొమ్మ వేసి దహనం చేశారు. దహనం నిర్వహణలో మార్వాడీలు హోలికా ముఖ్య పాత్ర పోషిస్తారు. ఈ పండగ వారి సంస్కృతి, సంప్రదాయాల్లో ఓ ముఖ్యమైన భాగం.



బీచ్‌రోడ్డులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మార్వాడీలు